పుణ్యపాపాల పద్మవ్యూహం

# మోసానికి పొలిమేరలు

రంధి సోమరాజు

'ఈనోటు దొంగనోటటండీ! మారదట' అన్న మా కుర్రాడి కంఠం ఒక్కసారి నా బుర్రను ఖరాబుచేసి పారేసింది. "పదిరూపాయల నోటే మారకపోవడం?" అని వాడివైపు వెర్రి వాడిలా చూశాను. వాడు మళ్ళీ అదేచెప్పి "ఈ నెంబరు దొంగనెంబరటండీ!" అన్నాడు. నాకు గుటక పడలేదు. గొంతుక పెగిలిరాలేదు. ఆ నోటు తీసుకొని అటూఇటూ త్రిప్పిచూచాను. కాని అందులో దొంగనోటనటానికి కావలసిన దాఖలా నాకేమీ కనబడలేదు. కానయితేనేం నెంబరే దొంగనెంబరట! అయితే ఇక్కడనుంచి ఈ దొంగనోట్ల నెంబర్లన్నీ బ్యాంకుదగ్గరనుంచి తెప్పించి దగ్గఱ ఉంచుకుంటేనేగాని లాభం లేదన్నమాట! ఇంతకీ ఈ పదిరూపాయల నష్టం ఎట్లా? చేతిది పెట్టుకోవలసిందే! చచ్చాను. ఇప్పటికే బోలెడన్ని అప్పులు పేటకుక్కల్లా తరుముతూవుంటే ఈ నష్టం రాయిలా అడ్డుతగలడం ఏమిటి? పడిపోయిన నామీద ఆ కుక్కలు విరచుకపడతాయి కాని, "అయ్యో పాపం ఎంత పెద్దదెబ్బతగిలింది!" అంటూ కాస్తంతయినా చెయ్యూతనిస్తాయాఏమిటి! అసలు పాపం వాటికి చేతులనేవి ఒకటి ఏడ్చి చస్తేకదా! సహాయసంగతి తరువాత ఆలోచించవచ్చు. ఏమైనా ఇంతమందిదగ్గఱ అప్పుపెట్టడం నాదే బుద్ధి తక్కువ. అసలు అప్పు పెట్టదలచుకున్నవాళ్లు ఎన్నివేలైనా ఒక్కడిదగ్గరే పెట్టడం భేషయిన విషయం. ఎటుతేలినా ఒక్కడితోనే తేలిపోతుంది. కాని ఇట్లా చిల్లరమల్లర అప్పులు పదిమంది దగ్గర పెట్టి రోజుకు పదేసిసార్లు పీకిపాకం పట్టించుకోవడం—కోరి యమదూతల్ని ఏరేరి కొనుక్కోవడమే!

ఇక "ఈ పదిరూపాయల నష్టం—నువ్వు అనుభవించవలసిందేనా?" అంటూ మాటిమాటికి ఓబాధాకరమైన తలపు, కనీసం ఓ తలుపైనాలేసి నా బుర్రలోకి అదేపనిగా గాలివాటుగా వచ్చేస్తూంది. ఈ భగవంతుడనే వాడికి బుర్రనేది ఉండివున్నట్లయితే—ఈ పాడు తలకాయ లన్నింటికీ కిటికీలు, తలుపులు ఎందుకు వేయించి ఉండడా అనిపించింది. ఏమైతేనేం ఈ పదిరూపాయలూ మనసునుపట్టి వదలడంలేదు. ముఖం వ్రేలాడ వేసుకొని అక్కడ అలాగే కూర్చుండి పోయాను. ఇంతలో మహాద్భుతమైన ఆలోచనొకటి ఈ బాధల మేఘాల్ని చీల్చుకుంటూ మెరిసింది. కాని అది తళుక్కుమన్న మరుక్షణమే మళ్ళీ చీకటి నాలో దట్టంగా ఆక్రమించుకుంది.

"ఆనోటు ఎలాగయితే నీదగ్గరకొచ్చిందో అలాగే నువ్వూ ఇంకొకళ్ళకి త్రోసేస్తే సరి" అన్న ఆ ఆలోచన ఎంతసేపో నా హృదయంలో నిలబడలేదు.

అసలా మారని నోటును వాళ్ళకెట్లా ఇవ్వడం? వాళ్ళది పుచ్చుకొని సరిగ్గాచూసి మారదంటేనో! వాళ్ళముందీ ముఖాన్నెట్లా మాడ్చుకోవడం? "తెలిసివున్నవాడివి నువ్వే ఇట్లా మాకంటగడతావా?" అని వాళ్ళు కడిగేస్తే ఖూనీ అయిపోనూ? పోనీ ఏ అమాయకుడైనా దాన్ని తీసుకొని చిల్లర ఇస్తేనో! సరిసరి చివరికి ఏమీ తెలియనివాళ్ళనా మోసగించడం? అవును మరిమోసం చేయెత్తి జై కొట్టడానికి వీలైన స్థలాలవేగా!

నిజంగా ఇంతద్భుతంగా ప్రభుత్వపు ప్రామిసరీ నోట్లకు నకళ్లు తీయగలిగిన ఆ సోదరులెంత ప్రజ్ఞావంతులు! పాడలేని అమ్మాయి సినిమాలో ఎట్లా పాడుతూన్నట్లు కనిపిస్తుందో సరిగ్గా అట్లాగే వుంది వీళ్ళప్రజ్ఞ! కాని ఆ పాడేదెవ్వరో గుర్తించిన తరువాత జరిగిన మోసాన్ని ఎట్లా తెలుసుకోకుండా ఉండగలం? మరి దొంగ నోటని తెలిసిన తరువాత సరైన నోటని ఎట్లా అనుకోగలం? అట్లాఅనుకొని మనసును మోసం చేసుకోవడం మరిసాహసమే!

మరి ఈ నోటు మారేమార్గం ఏమిటి? అసలేవిధంగానైన మారేమార్గం ఉన్నప్పుడు చల్లగా మార్చుకోవడమే మంచిది. కాని ఈగుండె అందుకు ఒప్పుకోవడం లేదు. ఇలా ఒప్పుకోవడం అంటే దానికేమాత్రం చేతగాదు. పోనీ ఇందువల్లవచ్చే నష్టాన్ని భరించవే అంటే 'ఉహుంహూ' అంటుంది. అందుకనే ఈమనస్సు ఇంతకుపూర్వం ఓ చీఫ్ జస్టిస్ అనుకునే వాణ్ణికానీ అది ఆ పదవికి అనర్హూరాలని మాత్రం ఇహ ఇప్పుడు తేల్చుకోక తప్పడం లేదు.

"డబ్బుకు డబ్బా పోయింది. ఏమిటి ఇట్లా మోసగించ బడ్డాను" అని మనసేమో పరిపరి విధాల వాపోతూంది. మళ్ళీ తనకే ఇట్లాంటిది సంభవిస్తే మరి హేమాహేమీలైలా చులాగ్గా బుట్టలో పడిపోతారని సమర్థించుకోవటమూ సమర్థించు కుంటూంది. అదేమి పాపమోగాని ఈ మనస్సెప్పుడూ హుషారుగా ఎసంబ్లీస్పీకరులా చస్తే రూలింగివ్వలేదు! దానికెందుకనో భయం జాస్తీ. సలహా అడిగిన యజమానికి పిరికివాడైన గుమస్తాలాగే సమస్యను జటిలపరుస్తుంది!

ఇంత బాధపెడుతూన్న ఆ వెధవనోటును చింపి పారెయ్యాలనుకున్నాను. కాని అందుకు చేతులు రాలేదు. ఇంకా ఏదో ఆశ బలంగా మరి లోలోన పనిచేస్తూంది కాబోలు! అలాగేదాన్ని మడిచిజేబులోనికి త్రోశాను. కాని ఈవిషయాన్ని మాత్రం ఎంత మరచిపోవాలని ప్రయత్నిస్తున్నా, మరపుమాత్రం రావడంలేదు. ఈ జ్ఞాపకశక్తి ఉన్నదే ఇదో దగారకం! ఫలాని విషయం జ్ఞాపకము ఉంచుకోవే అని ఎంతజాలిగా మనవి చేసుకున్నా అబ్బే! అది పొగరుబోతు పెళ్ళాంలా తనకు కావల్సినట్లే ఊరుకుంటుంది. పోనీ ఈ కష్టదశలో ఈ విషయాన్ని కాస్తా నీ కడుపు చల్లగా మరచిపోవే చిట్టీ అంటే అబ్బే, ఆ పొగరుకు గయ్యాళితనం తోడై ప్రాణాల్ని నిలువునా తోడేస్తుంది!

ఇలాంటి యమబాధలో నేను తపించిపోతూంటే, ప్రకాశరావొచ్చి "ఏమిటోయ్. అలా దిగాలుగా ఉన్నావ్?" అన్నాడు. నేను సంగతంతా చెప్పాను. పాపం వాడు చాలా విచారించాడు. "ప్రొద్దున్న ఎవ్వరిమొగం చూశావో" అన్నాడు; ఇంతకన్నా సానుభూతిని తెలిపే ఆ మార్గం మరి లేనట్టు! తరువాత వాడు, "ఆఁ ఆ. ఈమాత్రం దానికింత ఇదైపోవడ మెందుకూ. వెధవది ఎవడికిచ్చినా చులాగ్గా చిల్లరిస్తాడు" అని శలవిచ్చేసరికి, నేను అనగూడనిమాటైనా, పెదవులదాకా వచ్చేస్తే, "పోనీ నువ్వు మార్చితెస్తా మేమిటి?" అనేశాను. వాడిమొగం కాస్త ఎఱ్ఱబడింది. జవాబుగా, "ఎట్లాగో అట్లాగ నువ్వే మార్చేద్దూ" అంటూ అక్కడనుంచి సాగిపోయాడు; చెప్పడంలో ఉన్నంత సులభం చెయ్యడంలోలేదనే సత్యాన్ని అనృతంగా మార్చలేక కాబోలు!

ఇక ఈ బాధ నెట్లా అంతం చేసుకోవాలో తోచని సమయంలో సుబ్బారావుగారొచ్చారు. ఆయనరాగానే చెప్పగూడదనుకుంటూనే మళ్ళీ అంతా ఏకరవుపెట్టాను. అయితే ఆయనమాత్రం ఏమిచెయ్యగలడు? "సరే. రేపాదివారం శలవేగా వట్లూరు పోదాం. సోమవారం ప్రొద్దున్నే నువ్వు బస్సు కొచ్చెయ్యొచ్చు" అన్నారు. నేను, "సరే ఈ వూళ్ళోఉండి వెలగబెట్టే దేముంది? టిఫిను ఖర్చులూ, మూడుభోజనం టిక్కెట్టైనా మిగులుతాయి. గుడ్డిలో మెల్ల మేలు" అనుకొని "వస్తానండి. అక్కడకొస్తే ఈ బాధైనా కాస్త తగ్గుతుందేమో!" అన్నా. ఆయన "ఏదో కాస్త సత్కాలక్షేపం. పోదాం పద" అన్నారు.

ఒక్క పావుగంటలో వట్లూరు చేరుకున్నాం. ఆ రాత్రి భోజనాలయ్యాక ఒంటిగంట వరకూ కబుర్లు చెప్పుకొని హాయిగా నిద్రపోయాం. ఆదివారం అంతా బలే హుషారుగా గడచిపోయింది. పద్యాలతో పాటలతో, రేడియో ప్రోగ్రాంలతో, తర్కవితర్కాలతో బండి సాగిపోయింది. మంచాలమీద పడుకొని ఎప్పుడునిద్రపోయామో తెలియదుగాని పట్టిననిద్రమాత్రం మహగాఢంగా పట్టింది.

తెల్లవారింది. మరి సోమవారమూ వచ్చింది. నేను హాయిగా కాఫీ వగైరాలు మస్తుగా స్వీకరించి, "వస్తానండీ"అంటూ మాంచి హుషారుగా సెలవుతీసుకున్నా. ఏదో తెలియని ఆనందంతో గబగబా కార్లు ఆగే స్థలంవద్దకుచేరా. నాకోసమే ఆకారు ఎదురుచూస్తూందా అన్నట్టు అక్కడ ఆగి ఉంది. గభాలున అందులో అడుగుపెట్టాను. అడుగుపెట్టడమే తడవుగా కారు బుర్రుమంది.

ఊగుతూ లోపల చొరబడేప్పటికి ఓ అమ్మాయి కాలు, నా కాలుక్రింద నలిగిపోయింది. ఆ అమ్మాయి మనసులోనే తిట్టుకొని పైకిమాత్రం "భస్మం చేసేస్తా జాగ్రత్త!" అన్నట్టు ఎర్రగా చూసింది. ఇంతలో "కళ్లు మూసుకపోయా" అన్నాడో ఇస్త్రీ చెయ్యని, బొత్తాములులేని చొక్కా తొడుక్కున్న కఱకుమనిషి, నావైపు కొరకొరచూస్తూ. నేను మెల్లగా, "జాగి పోయా నండీ" అన్నా; ఏం ముంచుకొస్తుందో అని. అంతకన్నా ముంచుకొచ్చేది కానరుండా? ఏ ముంది ఇంతలో కండక్టరు బొంగురు కంఠంతో, "ఊఁ డబ్బులివ్వండి" అన్నాడు. ఒక్కసారి నేను నాలోకి వచ్చాను. జేబులోనికి తొంగిచూశాను. అందులో డబ్బు లెక్కడవి? ఆయ్యో వచ్చేప్పుడు సుబ్బారావుగారిని యెట్లా అడగడం మరచిపోయానో! ఇప్పుడెలా? "డబ్బు లివ్వండిసార్" అన్నాడు మళ్లీ కండక్టరు. ఆ అమ్మాయి, నావైపు చూసి నా చేష్టలనుబట్టి డబ్బులులేని బాపతనుకుంది కాబోలు మొగం లోనికి పల్చగా ఓ పావలా నవ్వు ప్రదర్శించింది. నా పనిమాత్రం అయోమయంగా ఉంది. ఆ కారు అపళంగా ఏదో గోతిలోనికి కూరుకుపోతూన్న ట్లనిపించింది. జేబులో మళ్ళీ చెయ్యి పెట్టా. ఏముంది? ఏముంటుందక్కడ? అదే మారని నోటు—పదిరూపాయల కాగితం, జేబులోనే ఉంది. నాచేయి గజగజా వణకింది. నా నుదుట చెమటపట్టింది. కంగారుపడిపోయాను. గజబిజిగా ఆ నోటు ఎలా తీశానో, ఎలా ఆ కండక్టరు చేతిలో పెట్టానో నాకు జ్ఞాపకంలేదు. నా నెత్తి మీద ఛళ్లున ఏదో బ్రద్దలయింది. కారు ముక్క ముక్కలయింది. గొల్లున గోల. నా తలకాయ గట్టిగా పట్టుకున్నాను. మా కారు నింకో కారు రయ్‌మని దూసుకొనిపోయింది. ఎందుకనో మా కారు జర్రన ఆగిపోయింది. నా రెక్క పుచ్చుకొని నన్ను ఎవరో విసిరేశారు.

నేను కాస్త స్థిమిత పడేటప్పటికి కారులో మనుష్యులు కనిపించారు. ఆ అమ్మాయి అక్కడే వుంది. నేనుకూడా కారులోనే ఉన్నాను. కండక్టరు మొగంమాత్రం నాకు తిన్నగా ఆనడం లేదు. కాని అదేదో ఉగ్రిత్రాడులా నాకు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. కార్లో అందరూ నావైపు చూస్తూన్నట్లుంది. "దొంగ...దొంగ. మోసగాడు" అని లక్షకంఠాలతో అరుస్తూన్న ట్లుంది.

కారు జూట్ మిల్లు దగ్గర ఆగింది. నేను గబ గబా దిగి పారిపోవాలనుకొని లేచాను. "అరే మీరు చిల్లర తీసుకోకుండానే వెళ్లిపోతున్నా రేమిటి? బస్సుస్టేండు దగ్గర దిగుదురుగాని రండి. అక్కడ చిల్లర ఇస్తాను" అన్నాడా కండాక్టరు.

అతనివైపు ఎలక్ట్రిక్ షాక్ తిన్నవాడిలా చూస్తూ అలాగే చతికలబడిపోయాను. బహుశా అతనీలోకపు మనిషికాదేమో. లేకపోతే నాకు డబ్బులిస్తా ననడమేమిటి? ఇంతకన్నా చోద్యమిం కెక్కడైనా ఉంటుందా?

కాని కారులాగినచోట అతను అణా పైస లతో ఇవ్వవలసినది. ఇచ్చేస్తూవుంటే, ఈ మనసు అదేమిటోగాని ఆ డబ్బును పుచ్చుకోకుండా ఉండలేకపోయింది. అక్కడనుంచి వెనక్కి చూడకుండా ఒక్కటే పరుగుతీసింది. మోసం మోసం అని ఎవ్వరో నా వెనుకనుంచి ఒకటే అరుస్తూ వెంటాడారు.

కాని ఇంటికి వెళ్ళిన తరువాత కాస్త నిదా నంగా ఆలోచిస్తే "ఆఁ...ఇందులో నువ్వు మోసం చేసిందేముంది పోదూ" అని ఆ బాధ నంతా చిటికెలో ఎగురగొట్టి పారేశా రెవ్వరో. అయినా ఈ మనసు, "ఇది నిజమా?" అన్న సందేహపుటూహను మాత్రం, ఆ చెల్లని నోటు లాగే—మార్చుకోవడానికి విపరీతంగా ప్రయత్ని స్తూనే ఉంది.

"ఈ సృష్టిలో కళకూ, సౌందర్యానికీ చోటులేదని సృష్టికర్త అనుకుని వుంటే, సృష్టికర్త పక్షిజాతిలో ఒక్క కోడినీ, పుష్పజాతిలో ఒక్క కాలిఫ్లవర్‌నీ మాత్రమే సృష్టించి ఉండును."—ఒక రాజకీయవేత్త

"—అలాగే మనుష్యజాతిలో ఒక్క ఆడవాళ్ళను మాత్రమే"—శంకర్స్‌వీక్లీ.